నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్ | ఆదివారం
15 డిసెంబర్ 2024
www.ntnews.com




చిన్నతెర

మోడల్‌గా కెరీర్ మొదలు పెట్టి చెల్లెలి క్యారెక్టర్లకు కేరాఫ్‌గా నిలిచిన నటి శిరీష చతుర్వేదుల. 'మనసంతా నువ్వే' సినిమాలో ఉదయ్ కిరణ్ చెల్లెలిగా టాలీవుడ్‌కు పరిచయమైన ఆమె దాదాపు అందరు హీరోలకు చెల్లెలుగా నటించింది. పెండ్లి తర్వాత నటనకు దూరమైన శిరీష మళ్లీ పదేండ్ల తర్వాత బుల్లితెరపై రీ ఎంట్రీ ఇచ్చింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో సినిమాలు, సీరియల్స్‌లో నటిస్తూ, యాంకరింగ్, డబ్బింగ్ చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. ప్రస్తుతం జీ తెలుగు 'సీతే రాముడి కట్నం' సీరియల్‌లో లలిత పాత్రలో అలరిస్తున్న శిరీష జిందగీతో పంచుకున్న ముచ్చట్లు..

# మాట నిలబెట్టుకున్నా

మా నాన్న కేంద్రప్రభుత్వ ఉద్యోగి. అమ్మ గృహిణి. నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంటర్ చదువుతున్నప్పుడు కాలేజ్ కాంపిటీషన్స్ హోస్ట్ చేశాను. ఒక ప్రముఖ పత్రికలో ఆ ఫొటోలు పబ్లిష్ అయ్యాయి. ఆ పత్రికలో వచ్చే ఫ్యాషన్ పేజీకి మోడల్‌గా చేయమని వాళ్లు అడిగారు. అలా డిగ్రీ ఫస్ట్ ఇయర్లో ఉన్నప్పుడు మోడల్‌గా మొదటి అవకాశం వచ్చింది. చదువు దెబ్బతింటుందని అమ్మానాన్న మొదలు ఒప్పుకోలేదు. కానీ, వాళ్లు పట్టు వదల్లేదు. సెలవుల్లో మాత్రమే షూట్ చేస్తామని నచ్చజెప్పారు. చీరలు, గాగ్రాలు, చుడీదార్లు మాత్రమే వేసుకుంటాననే కండీషన్ మీద ఒప్పుకొన్నా! ఫైనల్‌గా డిగ్రీ చదువుతూనే మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టాను.

### 'మనసంతా నువ్వే' అవకాశం..

పేపర్‌లో నా ఫొటో చూసి దర్శకుడు వీఎన్ ఆదిత్య గారు 'మనసంతా నువ్వే' సినిమాలో హీరో పాత్రకు చెల్లెలి క్యారెక్టర్‌కు ఆడిషన్స్‌కు రమ్మని పిలిచారు. సినిమా అనగానే అమ్మావాళ్లు అస్సలు ఒప్పుకోలేదు. 'మోడలింగే వద్దంటుంటే సినిమాల్లోకి కూడా వెళ్తావా?' అని కోప్పడ్డారు. చివరికి 'సినిమాలో నటించినా బాగా చదువుకుంటాను, పోస్ట్ గ్రాడ్యుయేషన్లో ఫ్రీ సీటు తెచ్చుకుంటాను' అని ప్రామిస్ చేయడంతో ఆదిత్యగారిని కలవడానికి అనుమతిచ్చారు. స్క్రీన్ టెస్ట్ ఓకే అయితే చూడొచ్చులే అనుకున్నారు. ఆదిత్యగారి ఆఫీస్‌కు వెళ్లిన మేము అక్కడ ఉదయ్‌కిరణ్‌ను చూడగానే షాకయ్యాం. అప్పటికే ఆయన నటించిన 'చిత్రం' సినిమా పెద్ద హిట్ అయ్యింది. నేను ఆయనకు పెద్ద అభిమానిని. అంత పాపులర్ హీరోకి చెల్లెలి క్యారెక్టర్ అనగానే ఎలాగైనా చెయ్యాలి అని ఫిక్సయ్యా. ఆడిషన్స్‌లో ఒక డైలాగ్ పేపర్ ఇచ్చి ప్రిపేర్ అయ్యి యాక్ట్ చేయమన్నారు. యాక్టింగ్ గురించి అసలేమీ తెలియకపోవడంతో ఆ కెమెరా, అక్కడ జనాలందరినీ చూసి డైలాగ్స్ మర్చిపోయా, భయంతో వణికిపోయా. చాలా టేక్స్ తీసుకున్నా. ఇక నావల్ల కాదనిపించి చేయలేనని చెప్పా. కానీ మా నాన్న మాత్రం ఇంకోసారి ట్రై చెయ్ అని ఎంకరేజ్ చేశారు. మేం లంచ్ చేస్తుండగా ఉదయ్ కిరణ్ వచ్చి 'నీ ప్రాబ్లమ్ ఏంటి? ఈ సీన్ పేపర్, డైలాగ్స్ అన్నీ మర్చిపో.. నేనే నీ అన్నయ్య అనుకుని.. అతను ఈ పరిస్థితుల్లో ఉంటే నువ్వు ఏం అంటావో అదే చెప్పు' అని ధైర్యమిచ్చారు. దాంతో సరేనని యాక్షన్ అనగానే నా నోటికొచ్చింది చెప్పా. ఆదిత్యగారు బాగా చేశానని మెచ్చుకుని ఆ క్యారెక్టర్‌కు నన్ను ఎంపిక చేశారు. కానీ, అమ్మానాన్నల్ని ఒప్పించడం చాలా కష్టం అయ్యింది. సెలవుల్లోనే షూటింగ్ ఉంటుందనీ, మా పేరెంట్స్ కూడా షూటింగ్‌కు రావొచ్చని చెప్పడంతో వాళ్లు ఒప్పుకొన్నారు.

### చదువుకుంటూనే..

నేను సినిమాల్లో నటిస్తున్నాని తెలియగానే బంధువులు, తెలిసినవాళ్లు చాలామంది రకరకాలుగా మాట్లాడారు. కానీ, నేను మాత్రం చదువుకు, ప్రొఫెషన్‌కు ఒకే ప్రాధాన్యం ఇచ్చాను. టైమ్ ఉన్నప్పుడు, హాలీడేస్‌లో షూటింగ్స్‌కు వెళ్లేదాన్ని. ఇంట్లో ఇచ్చిన మాటప్రకారం ఎమ్మెస్సీలో ఫ్రీ సీటు సాధించాను. 'మనసంతా నువ్వే' సక్సెస్ తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. స్టూడెంట్ నెం.1, వెంకీ, అతడే ఒక సైన్యం, సుబ్బు, బాలు, చిరుజల్లు, బలాదూర్, ఆంధ్రావాలా, సత్యం, వెంకీ.. దాదాపు 30 సినిమాల్లో నటించా. చిరంజీవి, బాలకృష్ణ, రవితేజ, జూ.ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ దాదాపు అందరు హీరోలకు చెల్లెలుగా చేశా. సినిమాలతోపాటు యాంకరింగ్, సీరియల్స్ చేశాను. నా మొదటి సీరియల్ నాగాస్త్రం. అది చాలా పెద్ద హిట్. అలౌఖిక, పద్మవ్యూహం, ఎండమావులు, నాతిచరామి.. ఇలా హిట్ సీరియల్స్‌లో నటించాను.

### అలా కుదిరింది.

నా జీవితంలో ఇండస్ట్రీకి రావడం ఎలా అనుకోకుండా జరిగిందో నా పెళ్లి కూడా అలాగే జరిగింది. 'హోం మినిస్టర్' షో కోసం ఒకరింటికి వెళ్లాను. అక్కడ ఒకావిడ నన్ను చూసి 'మంచి సంబంధం ఉంది పెళ్లి చేసుకుంటావా?' అని అడిగారు. నేను నో చెప్పాను. కానీ, ఆవిడ వెంటపడి నా నెంబర్ తీసుకుని మా పేరెంట్స్‌తో మాట్లాడారు. పెళ్లిచూపుల్లో మా ఆయనని చూసిన తర్వాత నో చెప్పలేకపోయా. చూడగానే నచ్చేశారు. గంట మాట్లాడుకున్నాం. ఆయన ఆలోచనా విధానం బాగా నచ్చింది. వాళ్లు వెంటనే ఓకే చెప్పారు. నాకే మూడు రోజులు పట్టింది. మా ఆయన ఎంబీఏ చేశారు, ప్రస్తుతం డెల్ టెక్నాలజీస్‌లో లీడ్‌గా చేస్తున్నారు.

### పదేళ్ల తర్వాత..

పెళ్లి తర్వాత నటించొద్దని అనుకున్నా. టీచింగ్ అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం. చదువుకునే రోజుల్లోనే ట్యూషన్స్ చెప్పేదాన్ని. బి.ఎడ్ కూడా చేసి ఉండటంతో పెళ్లి తర్వాత టీచర్‌గా పని చేయాలనుకున్నా. ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాయినయ్యా. తర్వాత బెంగళూరుకు షిఫ్ట్ అయ్యాం. మాకు ఇద్దరు పిల్లలు. చిన్నబాబు స్కూల్‌కు వచ్చాక కేంద్రీయ విద్యాలయంలో హైస్కూల్ ఇంగ్లిష్, మ్యాథ్స్ టీచర్‌గా చేస్తున్న సమయంలో మా గురువు ఆర్కే మలినేనిగారు ఫోన్ చేశారు. ఆయన దగ్గర నేను తొలినాళ్లలో 'సత్య' అనే సీరియల్ చేశాను. మలినేనిగారు, రసూల్ గారు చాలా విషయాలు నేర్పించారు. దాదాపు పదేండ్ల తర్వాత ఆయన నుంచి కాల్ రావడంతో మొదట నమ్మలేదు. తను చేసే తర్వాతి ప్రాజెక్టులో హీరోయిన్ తల్లి పాత్ర ఉందని, అది నన్ను దృష్టిలో పెట్టుకుని రాశానని చెప్పి ఒప్పించారు. అలా నేను మళ్లీ తెరమీద కనిపించిన సీరియల్ 'మౌనరాగం'. అది పెద్దహిట్ కావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. కానీ, నాకు కుటుంబమే మొదటి ప్రాధాన్యం. ఇంట్లోవాళ్లకు సమయం ఇవ్వడం కోసం బాగా నచ్చిన సీరియల్స్, సినిమాలు మాత్రమే ఒప్పుకొంటున్నా. 'సీతే రాముడి కట్నం' సీరియల్‌లో నా పాత్ర చాలా నచ్చింది. అందుకే స్టోరీ చెప్పగానే ఓకే చేశా. మా ఆయన సపోర్ట్‌తోనే నేను వర్క్ చేయగలుగుతున్నా. నా కెరీర్ ఇంత సక్సెస్‌ఫుల్‌గా సాగడానికి కారణం మా అమ్మానాన్న, నా భర్త. వాళ్లకి ఎప్పుడూ రుణపడి ఉంటా!

... హరిణి




# గడ్డం గ్యాంగ్

**ఒకప్పుడు హీరో అంటే? రాముడు మంచి బాలుడు టైప్! క్లీన్ షేవ్‌తో, సన్నని మీసకట్టుతో అలరించేవాడు. ఈస్ట్‌మన్ కలర్ రోజుల్లోనూ... హీరోలు మిస్టర్ క్లీన్‌గా సందడి చేశారు. ఇప్పుడు హీరో అంటే.. గడ్డం ఉండాల్సిందే! ఎంత ఎక్కువ ఉంటే.. అంత పెద్ద హీరో అన్నట్టుగా మారింది పరిస్థితి. హ్యాండ్‌సమ్ హీరోలు గడ్డాన్ని తెగ అభిమానిస్తున్నారు. విపరీతంగా పెంచేస్తున్నారు. పెట్టుడు గడ్డం వద్దు.. పెంచుడు గడ్డమే ముద్దంటున్నారు. కథ, పాత్రతో సంబంధం లేకుండా గడ్డం ఉన్న మగాడిదే డిమాండ్ అంటున్నారు!**

### 'హీరో' ఎలా ఉండాలంటే..

ఒడ్డూ, పొడుగుతో పాటు.. సిక్స్ ప్యాక్స్ బాడీ.. ఖరీదైన కాస్ట్యూమ్స్.. క్లీన్ షేవ్.. ఇలా చెబుతూపోతే హీరో మెటీరియల్ లక్షణాలు ఎన్నో ఉంటాయ్. ఒకప్పుడు టాప్ హీరోలంతా క్లీన్ షేవ్ లుక్‌తో సినిమాల్లో కనిపించేవారు. ఎన్టీఆర్, ఏయన్నార్ స్టైల్ గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన కృష్ణ, శోభన్‌బాబు అదే నీట్ లుక్‌తో కనిపించారు. 'నా యాల్దీ.. కత్తందుకో' అంటూ మాస్ డైలాగ్స్ చెప్పిన కృష్ణంరాజు కూడా క్లాస్‌గానే కనిపించేవాడు. పెన్సిల్ మీసకట్టుతో కనికట్టు చేసేవాడు. మూడో తరంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన చిరంజీవి, బాలయ్య, నాగ్ చాలా వరకు ఇదే పద్ధతిని కొనసాగించారు. పాత్ర డిమాండ్ చేస్తే తప్పా.. ఎప్పుడూ క్లీన్ అండ్ నీట్‌గా కనువిందు చేసేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. హీరోలంతా పోటాపోటీగా గుబురు గడ్డంతో కనిపిస్తున్నారు. 'రంగస్థలం'లో రామ్‌చరణ్, పుష్పలో అల్లు అర్జున్, 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండ ఇలా స్టార్లంతా గడ్డం లుక్‌కు ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. 'నాన్నకు ప్రేమతో' సినిమాతో బియర్డ్ లుక్‌లోకి మారిన జూనియర్ ఎన్టీఆర్ తర్వాత ట్రిపుల్ ఆర్, దేవరలోనూ అదే కంటిన్యూ చేశాడు. బాలనటుడిగా కెరీర్ మొదలుపెట్టి హీరోగా దూసుకొస్తున్న తేజా సజ్జ కూడా ఈ గడ్డం గ్యాంగులో చేరిపోయాడు. మనమే కాదు.. గట్టిగా మాట్లాడితే కన్నడ పరిశ్రమలోనూ గడ్డం తెగ పెరిగిపోతున్నది. కేజీఎఫ్‌లో యష్, కాంతారాలో రిషబ్ శెట్టి కూడా ఇదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు. గడ్డాన్ని సెంటిమెంట్‌గా ఫీలవుతున్నారు.

**ఒకప్పుడు** హీరో అంటే.. హృతిక్ రోషన్‌లా ఉండాలి అనేవాళ్లు. అంతేనా.. గడ్డం, మీసాలు లేకుండా నున్నగా షేవ్ చేసుకుని 'అబ్బా.. బాలీవుడ్ హీరోలా ఉన్నాడ'ని టాలీవుడ్ హీరోలూ అనేవారు. కొత్తగా ఏ హీరో ఆరంగేట్రం చేసినా.. క్లాస్‌గా కనిపించేవారు. ఈ లుక్‌ను మ్యాన్లీ స్టైల్ కమ్మేసింది. మీసాలేంటో తెలియని హృతిక్ కూడా 'మాస్ కా దాస్'లా మారిపోయాడు. చెప్పాలంటే.. బాలీవుడ్ బాద్‌షాలు కూడా ఇప్పుడు గడ్డం బాబులే.



### అర్జున్ రెడ్డి ఎఫెక్ట్

ఓ 30 ఏండ్ల కిందట చూస్తే జేడీ చక్రవర్తి గడ్డంతో కనిపించాడు. అప్పట్లో ఆయన్ని 'గడ్డం చక్రవర్తి' అనే సినీ అభిమానులు పిలిచేవాళ్లు. ఆనాటి హీరోలకు భిన్నంగా వెరైటీ లుక్‌తో రఫ్‌గా కనిపించేవాడు. ఇంకాస్త సెన్సిబుల్‌గా చూస్తే.. 'అందాల రాక్షసి' ప్రేమ కోసం తపించిన నవీన్ చంద్ర గుర్తుకొస్తాడు. గడ్డంతో తను కనిపించని తీరు అప్పట్లో అందరినీ ఆకట్టుకుంది. తర్వాత గడ్డంను సింబల్ చేసింది విజయ్ దేవరకొండే. అంతకు ముందు 'నాన్నకు ప్రేమతో'లో ఎన్టీయార్ క్లాసిక్ గడ్డంతో కనిపించినా.. 'అర్జున్ రెడ్డి'లో గుబురు గడ్డం ఎక్కువ ఫేమస్ అయింది.


> 'మీసాలు గుచ్చకుండా ముద్దాడతావా నన్ను' అని హీరోయిన్స్ పాడుకోవడం ఇక కుదరదు. మీసాలు ఏమో గానీ, గడ్డం అడ్డం రావడం ఖాయంగా కనిపిస్తుంది. హిస్టారికల్ సినిమాల్లో అయితే పొడవాటి జుత్తు, ఒత్తయిన గడ్డం అవసరం. స్వాతంత్ర్య సమరయోధుడు 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' పాత్ర కోసం చిరంజీవి గడ్డంలో కనిపించారు. 'గ్యాంగ్ లీడర్' జమానా నుంచీ చిరు గడ్డంతో కనిపించిన సినిమాలు ఎన్నో! కానీ, మాసిన గడ్డమే కానీ, బారెడు గడ్డంతో కనిపించిన సందర్భాలు తక్కువనే చెప్పాలి. బాలయ్య బాబు కూడా పాత్ర డిమాండ్ చేస్తే కొద్దిగా గడ్డం పెంచేవాడు. అంతేకానీ, ఇలా అడ్డదిడ్డంగా ఎన్నడూ పెంచుకోలేదు.

ఒకరకంగా ఈ తరం నటులు గడ్డం కల్చర్‌ని ఫాలో అవ్వడానికి విజయ్ బాటలు పరిచాడు. నాని, విశ్వక్ సేన్, కార్తికేయ లాంటి యువ హీరోలు కూడా గడ్డాలు పెంచేసి హిట్‌లు కొడుతున్నారు. మరోవైపు నాగ చైతన్య కూడా రఫ్ లుక్ ట్రై చేస్తున్నాడు. ప్రేమకథా చిత్రమైనా, చారిత్రక సినిమా అయినా హీరో గడ్డంతో దర్శనమిస్తున్నాడు. కథ నేపథ్యం కూడా పట్టించుకోవడం లేదు. అంతెందుకు రామ్‌చరణ్ నటించిన 'రంగస్థలం' 1980 దశకం నాటి స్టోరీ! ఆ రోజుల్లో పడుచు పోరగాళ్లు మాసిన గడ్డంతో కనిపిస్తే పెద్దలు తల మొట్టేవాళ్లు. అలాంటిది రామ్‌చరణ్ పాత్ర బారెడు గడ్డంతో కనిపించాడు. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో హీరో అజ్ఞాతంలో ఉంటేనో, విలన్ గ్యాంగులో తనను గుర్తుపట్టకుండా ఉండేందుకో గడ్డం పెంచేవాళ్లు. కానీ, ఇప్పుడు గడ్డం ఉంటే గానీ యంగ్ లుక్ రాదని నయా తరం నమ్ముతున్నది.

### మహేశ్ కూడా చేరిపోయాడు

మరీ అత్యవసరం అయితే చిన్ని గడ్డంలో దర్శనమిచ్చే మహేష్‌బాబు కూడా పూర్తిగా గడ్డం బ్యాచ్‌లోకి అప్‌గ్రేడ్ అయిపోయాడు. టక్కరిదొంగ, మహర్షి సినిమాలో ట్రిమ్మింగ్ గడ్డంతో అలరించాడు. ఇప్పుడు రాజమౌళి కాంపౌండ్ నుంచి పిలుపు రాగానే లుక్కే మార్చేశాడు. పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో దర్శనమిచ్చాడు. ఇక గడ్డం బ్యాచ్ అనగానే శర్వానంద్, సాయిదుర్గా తేజ్, నాని, రానా గుర్తొస్తారు. జాను సినిమాలో సాల్ట్ అండ్ పెప్పర్ స్టైల్‌లో మెప్పించాడు శర్వా. మెగా మేనల్లుడు సాయిదుర్గా తేజ్ 'చిత్రలహరి'లో గడ్డంతో చాలా నేచురల్‌గా నటించాడు. ఇక భిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించే శ్రీవిష్ణు కూడా ఫుల్ గడ్డం బాబే!! మొత్తంగా ఒకప్పుడు జీవన విధానంలో అడ్డంగా భావించే గడ్డం ఇప్పుడు ఫ్యాషన్ అయింది. సినిమాల్లోనూ విలన్లకు పరిమితమైన గడ్డం హీరోలకు వచ్చిచేరింది.

# బ్యూటీ బీట్‌రూట్!



**రక్తం** వృద్ధి చెందాలంటే బీట్‌రూట్ తినండి.. ఇది పాత ముచ్చట. చర్మం మిలమిలా మెరవాలంటే బీట్‌రూట్ రాయండి... ఇది కొత్త ముచ్చట. అవును, బీట్‌రూట్‌కు చర్మ సౌందర్య సాధనలోనూ మంచి స్థానం ఉంది. ఇందులోని బీటాలిన్, విటమిన్-సిలు చర్మాన్ని యవ్వనంగా ఉంచేందుకు సాయపడతాయి. బీట్‌రూట్‌లోని ఇతర పోషకాలు పిగ్మెంటేషన్‌ను, మచ్చలను తొలగించి తేమను నిలిపి ఉంచేందుకు తోడ్పడతాయి. అందుకే దీంతో ఫేస్‌మాస్క్‌లు వేసుకోవడం చలికాలంలో ఎంతో మేలు చేస్తుంది.

- **బీట్‌రూట్** రసంలో కొంచెం వేపపొడి, రోజ్‌వాటర్, బేకింగ్ సోడాలు కలిపి మిశ్రమంగా చేసి ముఖానికి రాసి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మొటిమల సమస్య తగ్గుతుంది.
- **ముల్తానీ** మట్టి, రోజ్‌వాటర్‌లను బీట్‌రూట్ పేస్ట్‌కు జోడించి మెడ, ముఖం మీద అప్లై చేయాలి. పావు గంట తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేస్తే జిడ్డు చర్మం నుంచి ఉపశమనం పొందొచ్చు.
- **చందనం** పొడిని, మెత్తగా రుబ్బిన బీట్‌రూట్ ముద్దతో కలిపి ముఖానికి మందమైన మాస్క్‌లా వేసి, కాస్త ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మెరిసే చర్మం సొంతమవుతుంది.



# జొన్న లడ్డు

### కావలసిన పదార్థాలు

**జొన్న పిండి:** ఒక కప్పు, **బెల్లం:** అర కప్పు, **పల్లీలు:** అర కప్పు, **నెయ్యి:** పావు కప్పు, **యాలకుల పొడి:** అర టీస్పూన్.

### తయారీ విధానం

స్టవ్‌మీద పాన్‌పెట్టి పల్లీలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో పావుకప్పు నెయ్యి వేసి, వేడయ్యాక జొన్న పిండి జోడించి పచ్చివాసన పోయేవరకు సన్నని మంటమీద వేయించాలి. ఇప్పుడు ఒక మిక్సీ జార్ తీసుకుని వేయించిన పల్లీలు, జొన్నపిండి, బెల్లం వేసి మెత్తగా మిక్సీ పట్టి ఒక ప్లేట్లో తీసుకోవాలి. పిండి మిశ్రమంలో మిగతా నెయ్యి, యాలకుల పొడి వేసి బాగా కలిపి లడ్డూలు చేసుకుంటే కమ్మటి జొన్న మిఠాయి సిద్ధం.

